క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల ఆది అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సీఎం సహాయ నిధి మంజూరు చేయించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కోరారు. ఎమ్మెల్యే సిఫార్సుతో ఆయనకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.65 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య విజయనగరంలోని తన క్యాంప్ ఆఫీసులో శనివారం అందజేశారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, సుంకరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సహాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బొండపల్లి: అంబటివలస పంచాయతీ మధుర గ్రామం అయ్యన్నఅగ్రహారానికి చెందిన కె.రమణ ఇటీవల మృతి చెందారు. ఆయన భార్య రమణమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయంగా సర్పంచ్ ఎస్.కసవయ్య, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు శనివారం రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రౌతు చిన్నా, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని గనివాడ గ్రామ ఎస్సీ కాలనీలో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో ఈ భవనం నిర్మించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వ శివశంకర్, మాజీ ఎంపీటీసీ గేదెల సూరినాయుడు, వార్డు మెంబర్‌లు సారిక పైడయ్య, కొమ్ము ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రంజిత్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం బొండపల్లి గ్రామానికి చెందిన యువకుడు రెడ్డి రంజిత్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్త సేకరణ బుట్టలను సర్పంచ్‌లకు అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: మండలంలోని 42 పంచాయతీలకు ప్రభుత్వం సరఫరా చేసిన 29 వేల చెత్తసేకరణ బుట్టలను మండల సర్పంచ్‌లకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు శనివారం అందజేశారు. వీటిని గ్రామాల్లో ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని సూచించారు. ఎంపీడీఓ కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఈఓపీఆర్డీ గాయత్రి పాల్గొన్నారు.

కేంద్రాలను ఆహ్లాదకరంగా ఉంచాలి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా ఉంచాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి (పీడీ) బి.శాంతకుమారి అన్నారు. గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కాన్వెంట్లకు దీటుగా విద్య అందిస్తున్నామన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అదనపు పౌష్టికాహారం అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సీడీపీఓ డోకుల ఉమాభారతి, నోడల్ అధికారి విజయకుమారి, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, సుభాసిని పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం



తుమ్మికాపల్లిలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి



కొత్తపాలెంలో పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలుకడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య

కొత్తవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుదేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.అనంతరం ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా,ఏమైనా సమస్యలున్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా...మరికొన్నింటిని గడువులోగా పరి ష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, ఈపథకాలు బడుగు, బలహీన వర్గాల పేదప్రజల ఆర్థికాభివృద్ధికి ఎంత గానో దోహద పడుతున్నాయని చెప్పారు. గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని వివరించారు. ఎంపీడీఓ వై.పద్మజ, కొత్తవలస ఎల్.కోట ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ జామి మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, ఎల్.కోట మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ యడ్ల కిశోర్, పార్టీ నాయకులు పిల్లా అచ్చులు, బి.ఏ నాయుడు, ఆనందరావు, లెంక భాస్కరరావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం

బొండపల్లి: సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. కొత్తపాలెం గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సీఎం జగన్ ఆదేశాలతో ఇంటింటికీ వస్తున్నామని చెప్పారు. అవినీతికి తావులేకుండా పార్టీలకతీతంగా అర్హులకు పథకాలు అందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.140 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామ సచివాలయాలతో ప్రభుత్వ సేవలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా వైద్యసేవలను గ్రామాల్లోనే ప్రజలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లి, మాయ మాటలు చెబుతారని, వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలం నాయుడు,జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, నాయకులు మంత్రి గోవింద, వేమలి వెంకటరావు, మీసాల తులసీరాం, ఎం.వెంకిరాజు, మోపాడ రామ్మూర్తి పల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

అశోక్, కళా ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి..?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- మంత్రి బొత్సను విమర్శించే అర్హత టీడీపీ నేత నాగార్జునకు లేదు
- వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

చీపురుపల్లి: టీడీపీలో అగ్రనాయకులుగా ఉంటూ రాష్ట్ర, కేంద్ర స్థాయిలో పదవులు చేపట్టిన అశోక్‌గజపతిరాజు, కిమిడి కళావెంకటరావు జిల్లాకు కాని వారి సొంత నియోజకవర్గాల్లో కాని ఏం అభివృద్ధి చేశారో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోసం మాట్లాడే అర్హత టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునకు లేదన్నారు. అంతేకాకుండా నాగార్జున మాటల్లో హుందాతనం ఉండడం లేదని, వారి తల్లిదండ్రులను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. 2004లో బొత్స సత్యనారాయణ మంత్రి అయిన తర్వాతనే జిల్లా అభివృద్ధిపథంలోకి వచ్చిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంత్రి బొత్స చొరవతో జిల్లాకు ఏకకాలంలో తోటపల్లి, పెద్దగడ్డ, తారకరామతీర్థసాగర్ వంటి పెద్ద సాగునీటి ప్రాజెక్టులు వచ్చాయని గుర్తు చేశారు. తాజాగా రూ.500 కోట్లతో జిల్లాలో మెడికల్ కళాశాల తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జిల్లాలో ఏ గ్రామం వెళ్లినా తాగునీరు, రోడ్లు, పాఠశాలలు, ఇతర మౌలిక వసతుల అన్నీ కనిపిస్తాయన్నారు. అదే అశోక్‌గజపతిరాజు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవుల్లో ఉండి జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఆయన హయాంలో ప్రైవేటు మెడికల్ కళాశాలను తీసుకొచ్చారే తప్ప, ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కిమిడి కళావెంకటరావు తన సొంత గ్రామాన్ని బాగు చేసుకోలేదని, ఇక ప్రజల కోసం ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. కిమిడి నాగార్జున ఇవన్నీ తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. చీపురుపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన మంత్రి బొత్స సత్యనారాయణను 2024లో నాలుగోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 2024 ఎన్నికలతో టీడీపీ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, పతివాడ రాజారావు, రేవల్ల సత్తిబాబు, దాలయ్య, రఘుమండ త్రినాథరావుపాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ బెల్లాన



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

మెంటాడ(గజపతినగరం రూరల్): అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చేద్దామని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అతిథులుగా హాజరయ్యారు. శాఖల వారీగా అభివృద్ధిపనులు, సమస్యలపై అధికారులతో చర్చించారు. ఎంపీ మాట్లాడుతూ మండలానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రజాప్రతినిధులు,అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో రహదారి విస్తరణతో పాటు 30 పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎరువులు కొరత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులదేనని అన్నారు. 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమం పూర్తయిన సచివాలయాలకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోందని, ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. గంగచోళ్లపెంట, కాలంరాజుపేట, పిడిశీల, గూనాం, గజపతినగరం, రామన్నపేట సర్పంచ్‌లు తమ పంచాయతీల్లో విద్యుత్ సంబంధిత సమస్యలపై ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో విద్యుత్‌శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, తహసీల్దార్ అరుణ తదితరులు పాల్గొన్నారు

• క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



చీపురుపల్లి: క్రీడా పోటీలకు హాజరైన విద్యార్థులు

చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనివాసనాయుడు,బెల్లాన వంశీకృష్ణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలను మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణితో కలిసి శనివారం వారు ప్రారంభించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు రాజారావు,గోవింద, తిరుమల,ఆది, రాందాసు, ముజ్‌కీర్ మహ్మద్, దాలయ్య, కృష్ణ పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి స్కూలు గేమ్స్ పోటీలను ఎంఈఓ బాలభాస్కరావు, హెచ్‌ఎం వల్లి, స్థానిక పెద్దలు రుద్రవెంకటరావు, మిరపాక రమణ శనివారం ప్రారంభించారు. విజేతలను నియోజకవర్గస్థాయి పోటీలకు పంపించనున్నామని ఎంఈఓ తెలిపారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాల వేదికగా మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను ఎంపీపీ సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఎంఈఓ బి.నర్సింగరావు నేతృత్వంలో అండర్-14, 17 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన వివిధ పోటీలకు 19 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 700 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

బహుమతుల ప్రదానం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీల్లో విజేతలకు ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ పి.రామారావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, నాయకులు అప్పారావు, కుమార్,కడుమల రాంబాబు, గుడివాడ తమ్మినాయుడు, పీడీలు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

గుర్ల/గజపతినగరం: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని గుర్ల, గజపతినగరం ఎస్‌ఐలు హరిబాబునాయుడు, గంగరాజు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండపాల ను పబ్లిక్ స్థలాలు, రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేయకూడదని సూచించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, నిమజ్జనం సమయాల్లో అల్లర్లు జరగకుండా బాధ్యత వహిస్తామని కమిటీ సభ్యులు డిక్లరేషన్ ఇవ్వాలని పేర్కొన్నారు. మండపాల వద్ద కమిటీ సభ్యులు నిరంతరం ఉండాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యభరోసా

బొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు వైద్యభరోసా కలుగుతోందని డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని ముద్దూరు గ్రామంలో శనివారం ఇంటింటా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి, బొండపల్లి పీహెచ్‌సీ సీహెచ్ఓ రాజ్‌గోపాల్, వైద్య సిబ్బంది ఎస్.ఎ.భాషా, గోపి పాల్గొన్నారు.

విధులకు డుమ్మాకొడితే చర్యలు

మెరకముడిదాం: విధులకు డుమ్మాకొట్టే, సరిగ్గా పనిచేయని సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.రత్నం హెచ్చరించారు. ఉత్తరావల్లి గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని ఎంపీడీఓకు గ్రామస్తులు ఫోన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె స్పందించి సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది సమయానికి కార్యాలయానికి రావడం లేదని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ పుష్పరావు ఉన్నారు.

హాస్టల్ భవనం కేజీబీవీకి అప్పగింత



పూజలు చేసి హాస్టల్ భవనాన్ని పునః ప్రారంభిస్తున్న నాయకులు

మెరకముడిదాం: మండల కేంద్రంలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పక్కనే ఉన్న పాత బాలికల వసతిగృహం భవనాన్ని కేజీబీవీకి అధికారులు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.వి.రమణరాజు, కోట్ల విశ్వేశ్వరరావు, తాడ్డి వేణుగోపాలరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ శనివారం పూజలు చేసి భవనాన్ని పునఃప్రారంభించారు.

ఓజోన్ సంరక్షణ మన బాధ్యత



శృంగవరపుకోట: ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ఓజోన్ పొర సంరక్షణ మనందరి బాధ్యతని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ కో-ఆర్డినేటర్ ఈరన్న పాల్గొన్నారు. ధర్మవరం హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి

చీపురుపల్లి: ఓజోన్ పొరను రక్షించి కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని స్థానిక బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు.'ఓజోన్‌పొర సంరక్షణ'అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీ లు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ సమన్వయకర్త కృష్టారావు, హెచ్‌ఎం రెహనా బేగం పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం



పిల్లపేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎంపీ బెల్లాన

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పిల్లపేట శ్మశాన వాటికలో రూ.5 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన స్నానపు గదులు, అలాగే గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.4 లక్షలతో నిర్మించిన సులభ్ కాంప్లెక్సు ప్రహరీ, అలాగే కూరాకులవీధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన సులభ్ కాంప్లెక్సు ప్రహరీ, ఫ్లోరింగ్, కాలువ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ సచివాలయానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షలు నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఆ నిధులతో తక్షణ అవసరాలకు సంబంధించిన పనులను అధికారులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ముల్లు పైడిరాజు, ఆదిబాబు, గంట్యాడ బుజ్జి, మహంతి ఉమ, రామారావు, సతివాడ అప్పారావు పాల్గొన్నారు.

మట్టి వినాయకప్రతిమల పంపిణీ



శృంగవరపుకోట: ఎస్.కోటలో మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యులు



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రతిమలను అందజేస్తున్న గురుదేవా ట్రస్టు సభ్యులు



చీపురుపల్లి: మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోవిందరాజులు



వేపాడ: సోంపురంలో విద్యార్థులకు ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ఎల్‌ఐసీ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, ప్రజలకు స్థానిక స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. స్నేహ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ఏ.ఎస్. వెంకటరావు, మంథా సుబ్బారావు మాట్లాడుతూ రసాయనాలు, రంగులతో తయారు చేసిన విగ్రహాల వినియోగంతో పర్యావరణం దెబ్బ తింటుందని, అందరూ మట్టి విగ్రహాల నే పూజించాలని కోరారు. స్నేహ సంస్థ సభ్యులు రామనారాయణ, శ్రీరామ్మూర్తి, గణేష్ పాల్గొన్నారు.

గురుదేవా ట్రస్టు ఆధ్వర్యంలో..

కొత్తవలస: మంగళపాలెం గ్రామ సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొత్తవలస,ఎల్.కోట మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్రామాల్లోని భజన మండలి సభ్యులకు మట్టివినాయక ప్రతిమలను, వినాయకవ్రత పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్, కొత్తవలస హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

చీపురుపల్లి: పట్టణంలోని పలువిద్యాలయాల్లో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు శనివారం మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మట్టి, పసుపుతో వినాయక విగ్రహాలు తయారు చేసుకుని వినాయక చవితి పూజలు చేసుకోవాలని కోరారు.

సోంపురం పాఠశాలలో..

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఏపీ గ్రీన్‌క్రాఫ్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



కొత్తపాలెంలో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రంను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



వెదురువాడలో సచివాలయంను ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: జగనన్న పాలనలో గ్రామస్వరాజ్యం సిద్ధించిందని, పల్లె ముంగిటే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొత్తపాలెంలో రూ. 20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్‌హెల్త్ క్లినిక్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వెదురువాడ గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఊరిచెంతనే అందుతున్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వెదురువాడ సర్పంచ్ పైడిరాజు, ఎంపీటీసీ ఎం.సత్యవతి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, పీఆర్ జేఈఈ కె.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

గంట్యాడ: సొంత స్థలాలతో పాటు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను ఎంపీడీఓ భానోజీరావు కోరారు. హౌసింగ్‌డేలో భాగంగా మండలంలోని నరవ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులతో కలిసి శనివారం ఆయ న పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పునాది, లింటల్, రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి పెండింగ్ లేకుండా బిల్లులు అందజేస్తున్న విషయాన్ని వివరించారు. హౌసింగ్ ఏఈ రాజ్‌గోపాల్, సర్పంచ్ పతివాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.